క్లుప్తంగా

నేడు ఉద్యమకారులకు సన్మానం

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మలిదశ తెలంగాణ ఉద్యమకారులను హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సన్మానించనున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సన్మాన సభకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువత, ఉద్యమకారులు, అన్ని రంగాల్లోని ఉద్యమకారులు పాల్గొనాలని కోరారు.

హైదరాబాద్‌కు తరలిన ఉద్యమకారులు


నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

హసన్‌పర్తి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు హైదరాబాద్‌కు ఉద్యమకారులు తరలివెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురిని ప్రభుత్వం గుర్తించి వారికి ఆహ్వాన పత్రాలు అందజేసింది. ఈమేరకు ఉద్యమకారులు అనుమాండ్ల విద్యాసాగర్, కాలె యాదగిరి, జన్ను కిషన్, ఆకుల కుమార్, కనపర్తి కిరణ్‌తో పాటు పలువురు నాయకులు బస్సులో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

ఉత్తమ ఏఈగా మౌనిక


అవార్డు అందుకుంటున్న మౌనిక

హసన్‌పర్తి: టీఎస్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఉత్తమ అధికారిగా హసన్‌పర్తి సెక్షన్ ఏఈ మౌనిక ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎండీ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డును ఆమె అందుకున్నారు.

వడ్డీలేని రుణాలు ఇవ్వాలి


నినదిస్తున్న మహిళా నాయకులు


ఖిలా వరంగల్: మహిళలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. వరంగల్ కరీమాబాద్‌లోని మల్లు స్వరాజ్యంనగర్‌లో ఐద్వా జిల్లా కార్యదర్శి దివ్య ఆధ్వర్యంలో ఐద్వా సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాలు అందించి ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండీ.బేగం, స్వరూప, లక్ష్మక్క, సరిత తదితరులు పాల్గొన్నారు.

బెతెస్త బాప్టిస్ట్ చర్చి నూతన కమిటీ ఎన్నిక


బెతెస్త బాప్టిస్ట్ చర్చి నూతన కార్యవర్గం

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ లక్ష్మీపురంలోని బెతెస్త బాప్టిస్ట్ చర్చి నూతన కమిటీని చర్చి తల్లి సంఘమైన సీబీసీ చర్చి సంఘం సభ్యులు ఆదివారం ప్రకటించారు. బెతెస్త బాప్టిస్ట్ చర్చి నూతన అధ్యక్షుడిగా కొమ్ము రాజు, కార్యదర్శిగా పోలెపాక ప్రసాద్, కోశాధికారిగా పోలెపాక సీతయ్య, ఉపాధ్యక్షుడిగా లింగాల విక్టర్, ఉప కార్యదర్శిగా పోలెపాక విలన్సన్, ఉప కోశాధికారిగా కొమ్ము ప్రవీణ్, నిర్మాణ కమిటీ చైర్మన్‌గా మంతెన రాజు, సలహాదారులుగా కొమ్ము జయాదర్, కొమ్ము జూపిటర్, పోలెపాక జాషువా, సంఘ పెద్దలుగా ఎర్ర యాకోబ్, తుళ్ల చంటి, గోదా దినకర్, మంద కర్ణాకర్, దేవ, ప్రవీణ్, అరుణ్‌ను ప్రకటించారు. అనంతరం చర్చి పాస్టర్ పోలెపాక కరుణ్ శ్రావణ్ ప్రార్థన చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని శ్రీవాణి విద్యామందిర్ పాఠశాలలో 1993 – 94లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాటి మధుర జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. అనంతరం తమ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో మైత్రేయి, సుజత, కల్యాణి, రజిత, సంధ్య, వరలక్ష్మి, వనిత, మోహన్, రాజ్‌కుమార్, మహేష్, జీవన్, విక్రమ్, ఉదయ్, రవికాంత్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



కాజీపేట చౌరస్తాలో నాయకులు, ఉద్యమకారులు, రైల్వే నాయకులు



మడికొండలోని దుర్గాబాయి మహిళా ప్రాంగణంలో..



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను నగర వ్యాప్తంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించి, ఉద్యమ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యమకారులను సన్మానించారు. రాష్ట్రం కోసం కలలుగని, అసువులు బాసిన అమరులు, ఉద్యమకారుల్లో స్ఫూర్తి నింపిన జయశంకర్ సార్, కాళోజీ, భూపతి కృష్ణమూర్తి లాంటి మహానుభావుల ఉద్యమస్ఫూర్తిని స్మరించుకుంటూ నివాళులర్పించారు.

\- సాక్షి నెట్‌వర్క్


ఖిలా వరంగల్ కోటలో అమరవీరుల స్తూపం వద్ద..


కాశిబుగ్గ: లేబర్‌కాలనీలో..


కడిపికొండలో కాంగ్రెస్ నాయకులు


హసన్‌పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో..


హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో..


అమరవీరుల స్తూపం వద్ద కవులు, కళాకారులు


వరంగల్ చౌరస్తా: వరంగల్ ఎల్బీఆర్ నగర్‌లో..


కాశిబుగ్గ: జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న డీవైఎస్ఓ సత్యవాణి


మడికొండలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు


హనుమకొండ వడ్డేపల్లిలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


పబ్లిక్ గార్డెన్‌లో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు, వాకర్స్

ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలి


స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు సూచించారు. రాష్ట్ర అవతర దినోత్సవం సందర్భంగా హనుమకొండ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి అదాలత్ వద్ద ఉన్న అమరుల స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. నాయకులు కర్రె భిక్షపతి, సారంగపాణి, కరుణాకర్, ఎల్లేశ్, రాజు, సంతోష్, సదానందం పాల్గొన్నారు.

వరంగల్ శివనగర్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావం, దశాబ్ది ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి హాజరై జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ల్యాదల్ల శరత్, గుండె బద్రి, రాయల వెంకటాద్రి, చందు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకానికి అవమానం



హసన్‌పర్తి: జాతీయ పతాకానికి అవమానం జరిగింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతగట్టులోని పశు ఆరోగ్య ఉపకేంద్రంలో ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే కొంతమంది అకతాయిలు జెండాను కింద పడేయడమే కాకుండా మద్యం తాగి అక్కడే బాటిళ్లు వదిలేశారు. ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి


పీటీసీలో జెండాను ఆవిష్కరిస్తున్న రాగ్యానాయక్


టీఎస్ఎస్పీలో జెండా ఆవిష్కరణలో..

ఖిలా వరంగల్: అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడుతూ, విధులపట్ల పోలీసులు మరింత అంకితభావంతో పనిచేయాలని టీఎస్ఎస్పీ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి, పీటీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాగ్యానాయక్ పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ పరిపాలన భవనం ఎదుట, పోలీస్ ట్రైనింగ్ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వేర్వేరుగా జరిగిన ఆవిర్భావ వేడుకల్లో వారు జాతీయ జెండాలను ఆవిష్కరించి, సిబ్బందికి ఉత్తమ సేవా పతకాలను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర శాంతిభద్రత, ప్రజల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, వెంకటేశ్వరరావు, రవీందర్, భిక్షపతి, పాండు నాయక్, ఆర్ఐ చంద్రశేఖర్, విజయ్‌కుమార్, కాశీరాం, నవీన్, మహేష్, రమేష్, వడ్డె నరేష్‌కుమార్, దీపక్, డాక్టర్ సుధీర్, ఏఓ కల్పనరెడ్డి, పీఆర్ఓ రామాచారి పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న రవీంద్రకుమార్ రవి

మామునూరు: ఎన్‌సీసీ శిక్షణలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని 8వ బాలికల బెటాలియన్ వరంగల్ క్యాంప్ కమాండెంట్ రవీంద్రకుమార్ రవి సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకరన్ ఆధ్వర్యంలో 1 నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల నుంచి మొత్తం 530 మంది బాలబాలికలు శిబిరానికి హాజరయ్యారని తెలిపారు. ప్రతీ కేడెట్ క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కె.రామన్ రావు, సుజితదేవి తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ


కాంగ్రెస్ భవన్‌లో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, నాయకులు

హన్మకొండ చౌరస్తా: అనేక ఉద్యమాలు, పోరాటాలు, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పార్టీ తూర్పు అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి జాతీయ, రాష్ట్ర గీతాలను ఆలపించి గౌరవ వందనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులతో కలిసి సోనియాగాంధీ చిత్రపటానికి నాయిని పాలాభిషేకం చేశారు. అనంతరం సుబేదారిలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో 1200ల మంది విద్యార్థులు, యువకులు బలిదానాలు చేసుకుంటే ఎంతమంది బాధిత కుటుంబాలను కేసీఆర్ ఆదుకున్నారని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప, అక్రమాల పుట్టగా మార్చారని విమర్శించారు. సోనియాగాంధీ సహకారంతోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల కలలు నెరవేర్చేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, పీసీసీ సభ్యుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, ఎలకంటి రాములు, తోట వెంకటేశ్వర్లు, నాయకులు లక్ష్మారెడ్డి, అజీజ్‌ఖాన్, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమం ఉన్నతమైనది


బాలుకు ఆర్థికసాయం అందజేస్తున్న బాబురావు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ప్రొఫెసర్ బాబురావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం అత్యున్నతమైనదని, ముందు తరాల వారికి తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలియాల్సి అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పీఠం సిబ్బందిని సన్మానించారు. వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయ జానపద గిరిజన విజ్ఞానపీఠంలో స్వీపర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన బానోతు బాలుకు భూక్య బాబురావు రూ.4 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, పరవస్తు విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి, సులోచన, మధు, మోహన్, విద్యార్థి నాయకులు డాక్టర్ రమేష్, ఎం. వెంకట్, పి.సతీష్, నోముల రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విరమణ ఉద్యోగానికే.. సమాజ సేవకు కాదు


యాదగిరి గౌడ్ దంపతులను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు

హన్మకొండ: ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని సమాజ సేవకు కాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ అన్నారు. హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలోని శ్యామల గార్డెన్స్‌లో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌లో చీఫ్ అడ్మిన్ అధికారి భీమగాని యాదగిరి గౌడ్ ఉద్యోగ విరమణ సన్మాన అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ యాదగిరి గౌడ్ సామాన్య కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి అంచెలంచెలుగా ఎదిగారని ప్రశంసించారు. 32 ఏళ్లపాటు విధులు నిర్వర్తించి అధికారుల మన్ననలు చూరగొన్నారని చెప్పారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన యాదగిరిగౌడ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి, అడిషనల్ ఎస్పీ సదానందం, ఆయా సంఘాల నాయకులు భీమగాని సౌజన్య గౌడ్, బాబు యాదవ్, మాచర్ల సుధాకర్, బండారి జనార్దన్ గౌడ్, మాడగోని భద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అతిథులు, ఉపాధ్యాయులు

మడికొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య లభిస్తుందని పలువురు సూచించారు. ఈమేరకు మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి మాట్లాడుతూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. సర్కారు బడుల్లోనే ఉన్నత విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో రూ.వేలకు వేలు ఖర్చుచేయడం తప్ప మెరుగైన విద్య లభించదని చెప్పారు. కార్యక్రమంలో మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, గ్రామస్తుడు పెండ్లి కృష్ణమూర్తి, జెడ్పీహెచ్ హెచ్ఎం సంధ్యారాణి, ఎంపీపీఎస్ హెచ్ఎం మల్లారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పూల్యానాయక్, ఉపాధ్యాయులు కోమల్ రెడ్డి, అరుణ, మన్నె చంద్రయ్య, రమేష్, వేణుగోపాల్, కమల, సరిత, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, మల్లేశ్వరి, లలిత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


రిజిస్టర్లను పరిశీలిస్తున్న అధికారులు

హసన్‌పర్తి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చల్లా ప్రసాద్ హెచ్చరించారు. హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్, బైరాన్‌పల్లిల్లోని ఎరువులు, విత్తనాల షాపులను రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను పరిశీలించారు. షాపుల్లో ఉన్న స్టాక్‌ను సరిచూశారు. అనంతరం తహసీల్దార్ చల్లా ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ కొరతను సృష్టించొద్దని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి అడ్లూరి అనురాధ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసిన వారికి తప్పకుండా రసీదు ఇవ్వాలన్నారు. ఆ రసీదును పంటచేతికి వచ్చే వరకు రైతులు భద్రపర్చుకోవాలని సూచించారు. హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ జవ్వాడి సురేష్ మాట్లాడుతూ విత్తనాలు బ్లాక్‌లో అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కు ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


వివరాలు తెలుసుకుంటున్న మసూద్, ఫుర్కాన్

న్యూశాయంపేట: మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ అన్నారు. వరంగల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఫోరం ఆధ్వర్యంలో ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఫోరం చైర్మెన్ డాక్టర్ అనీస్ సిద్దీఖీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మసూద్ మాట్లాడుతూ ఫోరం ఆధ్వర్యంలో పేదలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిచయ వేదిక కార్యక్రమానికి సుమారు రెండువందల మంది జంటలు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మహ్మద్ ఫుర్కాన్, ఫోరం సభ్యులు మహ్మద్ కలీం, నాజ్రీన్, ఖుస్రూ అలీం, మహ్మద్ నయీం, సయ్యద్ అక్బర్, సిరాజ్ అహ్మద్, నుస్రత్, మెరాజ్ సుల్తానా, మాషూఖ్ రబ్బానీ, మొహిసినా, రుఖ్సానా తదితరులు పాల్గొన్నారు.

సంక్రమణ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో బిలోరియా, ప్రశాంతిమోహన్, తదితరులు

న్యూశాయంపేట: ప్రజారోగ్య వ్యవస్థలో సంక్రమణ వ్యాధుల నియంత్రణ అత్యంత ప్రాధాన్యత అంశమని, ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ ఆర్సి బిలోరియా సూచించారు. హనుమకొండ ప్రశాంతి ఆస్పత్రిలో నర్సులకు శానిటేషన్, హైజీన్ అంశాలపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం రోగుల సేవలో ఉండే నర్సులు ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శానిటైజేషన్ హైజీన్ విధానాలపై శాస్త్రీయ పద్ధతిలో నర్సులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లోని 70 మంది నర్సులు శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రశాంతి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంతిమోహన్, వైద్యులు కిరణ్‌కుమార్ హరిదాస్, పి.రమేష్, వైష్ణవి, కళాశంకర్, రాజేంద్ర కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రలో యువకుల వీరంగం

ఖిలా వరంగల్: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో కొంతమంది యువకులు వీరంగం సృష్టించారు. వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయ ప్రాంగణం వద్దకు శోభాయాత్ర చేరుకోగానే.. మద్యం మత్తులో ఉన్న రంగశాయిపేట, కరీమాబాద్ చెందిన యువకులు రెండు వర్గాలు వీడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో రంగశాయిపేటకు చెందిన సూరం రమేష్ కుమారుడు ఫహస్ వర్మ తలకు గాయాలు కాగా, కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల రాకను గుర్తించిన కొంతమంది యువకులు పరుగులు పెట్టగా.. మరికొందరు వారికి చిక్కినట్లు తెలిసింది. బాధితుడి తండ్రి సూరం రమేష్ మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎండీ.సమీర్ అనే యువకుడు ఫహస్ వర్మపై ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.